మూసీ నాలా.. పూడికతీతకు నోచుకోదా.?

● 500 ఫీట్ల వరకు కూలిన రిటైనింగ్ వాల్ ● పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



పూడికతీయాల్సిన నాలా ఇదే..



నెహ్రూనగర్-బీ వద్ద కూలిన రిటైనింగ్ వాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వర్షాకాలం వచ్చిందంటే మూసీ నాలా పరీవాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలకు కంటిమీద కునుకు ఉండదు. ఎడతెరిపి లేకుండా వర్షం కురిస్తే మూసీ నాలా పొంగి తమ కాలనీలు, బస్తీలను ముంచెత్తుతుందని లోతట్టు ప్రాంతవాసులకు తెలుసు. దీంతో వర్షంకాలం వస్తుందంటే చాలు ఆందోళనగా కనిపిస్తారు. ప్రస్తుతం రాంనగర్ డివిజన్‌లోని సూర్యనగర్, నెహ్రూనగర్, నెహ్రూనగర్-బీ ప్రాంతాల ప్రజలు అలాంటి ఆందోళనలోనే ఉన్నారు.

ముంచేశాక స్పందించి ఏమి లాభం?

వర్షాకాలం దాదాపు వచ్చేసినా మూసీ నాలాలో పూడికతీత పనులు చేపట్టలేదు. దీంతో నాలా పరిసరాల్లో ఉండే వారు ఆందోళన చెందుతున్నారు. పూడికతీత పనులు చేపడితే నాలా పొంగిపొర్లకుండా కొంత వరకు ముంపు సమస్యను నివారించవచ్చని స్థానికులు చెబుతున్నారు.వర్షాలు బాగా కురిసి లోతట్టు ప్రాంతాలను ముంచేశాక అప్పుడు అధికారులు స్పందించి ఏమి లాభమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాలా పనులు చేపడతారో లేదో చూడాలి.

కూలిన రిటైనింగ్ వాల్...

రెండు నెలల క్రితం కురిసిన ఆకాల వర్షానికి నెహ్రూనగర్-బీ ప్రాంతంలో 400 నుంచి 500 ఫీట్ల వరకు రిటైనింగ్ వాల్ కూలింది. దీంతో నాలాలో నుంచి వచ్చే నీరంతా సూర్యనగర్, నెహ్రూనగర్-బీ కాలనీలోకి వెళ్లిపోయాయి. అక్కడ తాత్కాలికంగా వల మాదిరిగా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా అక్కడక్కడ రిటైనింగ్ వాల్ కూలడానికి సిద్ధంగా ఉంది. భారీ వర్షం కురిస్తే ఉన్న రిటైనింగ్ వాల్ పూర్తిగా కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు.

కౌన్సిల్‌లో మాట్లాడాను..



రెండు నెలల క్రితం ఆకాల వర్షానికి కూలిన రిటైనింగ్ వాల్ పునరుద్ధరణ చేయాలని జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో మాట్లాడాను. మేయర్ వచ్చి పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే ఇది వరకే జోనల్ కమిషనర్ వచ్చి పరిశీలించారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రిటైనింగ్ వాల్ వద్ద ఉన్న రోడ్డు కూలిపోయింది. ఎంత చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే చర్యలు తీసుకోవాలి.

– కె.రవిచారి, రాంనగర్ కార్పొరేటర్

ప్రమాదం పొంచి ఉంది



నాలా పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ప్రమాదం పెద్ద ఎత్తున పొంచి ఉంది. వర్షాకాలం సమీపించిన అభివృద్ధి పనులు చేపట్టకపోవడం అత్యంత బాధాకరం. రిటైనింగ్ వాల్ కూలిపోవడంతో స్థానికులంతా ఆందోళనకు గురి అవుతున్నాం. జోనల్ కమిషనర్ వచ్చి పరిశీలించారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రమాదం జరిగాక చర్యలు తీసుకుంటారా ఏంది? గోడ కూలి రెండు నెలలు అవుతున్నా ఎందుకు పట్టించుకోవడంలేదు.?

– మన్నె దామోదర్‌రెడ్డి, స్థానికుడు

అంబర్‌పేట, కాచిగూడ డివిజన్ల బీజేపీ నూతన కమిటీల ఎన్నిక

అంబర్‌పేట: అంబర్‌పేట డివిజన్ బీజేపీ నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్ శుక్రవారం ప్రకటించారు. డివిజన్ ప్రధాన కార్యదర్శులుగా లక్ష్మణ్, శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా తిరుపతిగుప్తా, మహేశ్, వినోద్‌యాదవ్, నరసింహగౌడ్, కార్యదర్శులుగా శోభ, పద్మ, శ్రీనివాస్, దేవయ్య, కోశాధికారిగా చంద్రమౌళిను నియమించామని తెలిపారు.

కాచిగూడ డివిజన్ నూతన కార్యవర్గం...

కాచిగూడ: కాచిగూడ డివిజన్ బీజేపీ నూతన కార్యవర్గాన్ని డివిజన్ అధ్యక్షుడు బల్వీర్ ప్రకటించారు. శుక్రవారం బర్కత్‌పురలోని బీజేపీ కార్యాలయంలో కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. డివిజన్ ప్రధానకార్యదర్శులుగా ఆర్.సంతోష్,సాయి కుమార్, ఉపాధ్యక్షులుగా మల్లికార్జున్, సురేష్, సుజాత, ఎం.ఆనంద్, కార్యదర్శులుగా శంకర్, వరలక్ష్మి, మంజుల, విజయలక్ష్మి, కోశాధికారిగా ఆనంద్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్‌రాజ్, రమేష్‌యాదవ్, వినోద్‌యాదవ్, నర్సింగ్‌రావు, శిరీసాగ్, సుభాష్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

చేప ప్రసాదంతో ఆస్తమా తగ్గదు

ప్రొ. రామచంద్రయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చేప ప్రసాదంతో ఆస్తమా తగ్గదని జనవిజ్ఞాన వేదిక తెలంగాణ సైన్స్ కమ్యూనికేషన్ సబ్‌కమిటీ కన్వీనర్ ప్రొ. రామచంద్రయ్య అన్నారు. ప్రతిఏటా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే చేపప్రసాదం పంపిణీకి ప్రభుత్వం సహకారం అందించడం సరైంది కాదన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ... చేప ప్రసాదంలో ఆస్తమాను తగ్గించే ఎలాంటి వైద్య లక్షణాలు లేవని పరీక్షల్లోనే నిరూపణ అయ్యిందన్నారు. అయిన చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని బత్తిని సోదరులు ఆపకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ ప్రధాన కార్యదర్శి రాజా, కో-కన్వీనర్ డా. రజిత, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు కృషి చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అంబేడ్కర్ లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ లా కళాశాలలో 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఎదుర్కోవడం'అనే అంశంపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం సృజన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ ప్రొ. లింబాద్రి, డైరెక్టర్ విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

తానా మహాసభలకు టి. ధర్మరావుకు ఆహ్వానం

చిక్కడపల్లి: సాంస్కృతి రత్న టి. ధర్మరావుకు అమెరికా తానా మహాసభలకు ఆహ్వానించారని ఇటీక్లా గౌరవ అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. శుక్రవారం చిక్కడపల్లిలో ఆయన మాట్లాడుతూ.. అమెరికాలో డెట్రాయిట్ నోవి సబర్బన్‌లో జరిగే 24వ వార్షిక మహాసభలకు తెలుగు ప్రముఖులతో పాటు రాజకీయ, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఈ సభలకు ఆహ్వానించినందుకు ధర్మారావు ధన్యవాదాలు తెలిపారు.

9న 'కృష్ణను ముంచి గోదావరి మీద పడ్డారు'

ముషీరాబాద్: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'కృష్ణను ముంచి గోదావరి మీద పడ్డారు'అనే అంశంపై 'ఆంధ్ర జనదోపిడీని అడ్డుకుందాం.. తెలంగాణ జలాలను రక్షించుకుందాం 'అనే నినాదంతో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ తెలిపారు. ఈ సమావేశానికి రావాల్సిందిగా నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, సుధాకర్ ముదిరాజ్, నందగోపాల్, రామలింగం , ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

చిక్కడపల్లి: కచ్చానాల పైపులైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. డివిజన్‌లోని జవహర్ పాఠశాల సమీపంలో చేపడుతున్న పైపులైన్ నిర్మాణ పనులను ఆయన బీఆర్ఎస్ నేతలతో కలసి శుక్రవారం పరిశీలించారు. జనాభాకు అనుగుణంగా రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను ఆధునీకరించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేష్‌కుమార్, ముఠా నరేష్, శ్రీకాంత్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలి అదృశ్యం

కాచిగూడ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... చెప్పల్‌బజార్ ప్రాంతానికి చెందిన బి.సందీప్ కుమార్ తల్లి కుందన్‌బాయి (80). ఈనెల 4వ తేదీన నింబోలిఅడ్డలో ఉంటున్న సోదరుడు దీపక్ ఇంటికి వెళ్లింది. గంట తర్వాత దీపక్‌కు ఫోన్ చేస్తే కుందన్‌బాయి ఇంటికి రాలేదని చెప్పాడు. దీంతో వివిధ ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. సందీప్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మ్యూజిక్ స్టూడియోలో అగ్నిప్రమాదం

చిక్కడపల్లి: బాపునగర్ మేదరబస్తీలో ఏసీ కంప్రెసర్ పేలి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో మ్యూజిక్ స్టూడియోలోని ఖరీదైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేదరబస్తీలో వివేక్‌సాగర్ మ్యూజిక్ డైరెక్టర్. ఇక్కడే మ్యూజిక్ స్టూడియో నిర్వహిస్తున్నారు. ఏసీ కంప్రెసర్ కూడా లోపలి భాగంలో ఉండటంతో ఆన్‌లో ఉన్న ఏసీ కంప్రెసర్‌లో ప్రెషర్ పెరిగిపోయి షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కంప్రెసర్‌లో నుంచి పొగలు, మంటలు రావడంతో సిబ్బంది హుటాహుటిన బయటకు పరుగెత్తారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బతుకమ్మకుంట అభివృద్ధి ప్రజల కోసమే..

అంబర్‌పేట: బతుకమ్మకుంట అభివృద్ధి అనేది ప్రజల కోసమని... ఏ ఒక్కరి ప్రయోజనాల కోసం కాదనే విషయాన్ని బీఆర్ఎస్ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి గుర్తించాలని మాజీ కార్పొరేటర్ నారాయణస్వామి అన్నారు. బతుకమ్మకుంటలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో టీపీసీసీ నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, శ్రీకాంత్‌గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బతుకమ్మకుంట ముమ్మాటికి ప్రభుత్వ మిగులు భూమి అని పేర్కొన్నారు. దానిని మాజీ ఎంపీ వి.హనుమంతారావు చొరవతో ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే ఎడ్ల సుధాకర్‌రెడ్డి అర్థహితంగా ప్రకటనలు, ఆరోపణలు చేయడం తగదన్నారు. వీహెచ్ హౌసింగ్ సొసైటీలో కబ్జాలు చేయలేదని వారు తెలిపారు. వీహెచ్‌పై ఆరోపణలు చేస్తే నిరూపించాలని డిమాండ్ చేశారు. వాస్తవానికి బతుకమ్మకుంట స్థలం సయ్యద్ అజాంకు చెందినదని దానిని ప్రభుత్వం సిలింగ్ ల్యాండ్‌గా గుర్తించి కుంటగా ప్రకటించిందన్నారు. దానిపై ఎడ్ల సుధాకర్‌రెడ్డి సయ్యద్ అజాం వద్ద అగ్రిమెంట్ చేసుకున్నట్లు చెబుతూ తనదని అభ్యంతరం చెప్పడం దారుణమని చెప్పారు. న్యాయస్థానాల్లో ఎందుకు ఆయనకు అనుకూలంగా తీర్పు రాలేదో చెప్పాలన్నారు. ప్రభుత్వ సంస్థ హైడ్రా చిత్తశుద్ధితో పనులు చేస్తుంటే ప్రజలు హర్షిస్తున్నారని అన్నారు. ఎడ్ల సుధాకర్‌రెడ్డి వ్యవహార శైలిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.



సమావేశంలో బతుకమ్మకుంట అభివృద్ధి నమూన చిత్రాన్ని చూపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బధిరులకు జీఓ నం.89 విడుదల హర్షణీయం

డీఎస్‌డీ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో బధిరుల సంక్షేమం కోసం జీఓ నం.89 విడుదల చేయడం హర్షణీయమని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ (డీఎస్‌డీ) జాతీయ కన్వీనర్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జీఓ నం.89 కింద 4జీ మొబైల్, మూడు చక్రాల మోటర్ వాహనాలు ఇవ్వటం అభినందనీయమని అన్నారు. తాము చేసిన పోరాటం వలనే ఈ జీఓ వచ్చిందన్నారు. దివ్యాంగులకు చదువుతో నిమిత్తం లేకుండా ఇలాంటి సౌకర్యాలు అందుతాయని పేర్కొన్నారు. పన్నేండేళ్లుగా చేసిన పోరాటాల ఫలితంగా అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, మంత్రి సునీతాలక్ష్మారెడ్డిలు మొదటి దశలో దివ్యాంగులకు ఇచ్చారని తెలిపారు. అయితే తెలంగాణ వచ్చాక కేసీఆర్ పదేళ్ల వరకు చదువుకున్న దివ్యాంగులకు 70శాతం వైకల్యం ఉన్న వారికి అరకొరగా పంపిణీ చేశారన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్న తరుణంలో తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య కృషితో ఈ జీఓ వచ్చిందని తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

రూ.2.80లక్షల విలువ చేసే సొత్తు రికవరీ

ముషీరాబాద్: ఇంట్లో ఎవరు లేని సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2.80 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, సిల్వర్, నగదును స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో చిక్కడపల్లి ఏసీపీ రమేష్, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ రాంబాబులు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 4న భోలక్‌పూర్ డివిజన్‌లోని గుల్షన్‌నగర్‌లో రుక్సానాబేగం, మహ్మద్ షకీల్ దంపతులు తమ పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. వీరి చిన్న కుమార్తె వివాహం నిమిత్తం బంగారు ఆభరణాలు, సిల్వర్, కొంత నగదును భద్రపరిచారు. అయితే 3వ తేదీన బట్టలను ఆరేయడానికి డాబాపైకి వెళ్లారు. తాను దాచుకున్న సిల్వర్ వస్తువు డాబాపై కనిపించింది. దీంతో అనుమానం వచ్చిన రుక్సానాబేగం వెంటనే కుమార్తె పెళ్లి కోసం దాచుకున్న డబ్బాను తెరిచి చూడగా బంగారు, సిల్వర్, నగదు మాయమైనట్లు గుర్తించింది. కుటుంబ సభ్యులను అడిగితే తెలీదని చెప్పారు. దీంతో ఆమె ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాలను పరిశీలించి గుల్షాన్‌నగర్‌కు చెందిన అహ్మద్ అల్తాఫ్(22), రాంనగర్‌లోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన మహ్మద్‌గౌస్(29)ను అదుపులోకి తీసుకుని విచారించారు. దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి నగదు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన డీఐ నదీమ్‌హుస్సేన్, ఎస్సై చలపతిరెడ్డి, క్రైమ్‌స్టాఫ్ కిశోర్, ఉదయ్‌కుమార్, దిలీప్‌కుమార్, కార్తీక్, ప్రభాకర్‌ను అభినందించారు.



మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కాచిగూడ: కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడి విజయవంతంగా 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని బీజేపీ నేత డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో సెంట్రల్ జిల్లా కార్యక్రమాల కన్వీనర్ అజయ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జూన్ 9వ తేదీ నుంచి జూన్ 25వ తేదీ (ఎమర్జెన్సీ రోజు) వరకు పార్టీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. డివిజన్లలో సంకల్ప సభలు, శక్తి కేంద్రాల వారీగా రచ్చబండలు, జిల్లా స్థాయిలో ప్రొఫెషనల్ మీట్స్, డిజిటల్ ప్లాట్ ఫామ్స్‌పైన (మైగవ్‌పోర్టల్‌లో) ఎడిటోరియల్స్ బ్లాక్స్, వివిధ రకాల పోటీలను నిర్వహించాలని సూచించారు. 'ఎమర్జెన్సీ'విషయంలో నేటి యువతకు తెలియజేసే విధంగా ప్రతి డివిజన్‌లో పెద్ద ఎత్తున సభలు నిర్వహించాలన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి పోలింగ్ బూత్‌లో మొక్కలు నాటే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. జూన్ 23వ తేదీన డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను నిర్వహించాలని న్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జి.కృష్ణయాదవ్, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, ఎన్వీ సుభాష్, రాఘవరెడ్డి, సి.నందకిషోర్ యాదవ్, కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



బర్కత్‌పురలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కొత్త రేషన్‌కార్డులను వెంటనే మంజూరు చేయాలని ముషీరాబాద్ జోన్ సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ సర్కిల్-6 ఏఎస్ఓ దీప్తిని శుక్రవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రెండుసార్లు దరఖాస్తు చేసుకున్నామని ఆమెకు తెలిపారు. ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, రమేష్, వెంకటమ్మ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్



అంబర్‌పేటలో పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

అంబర్‌పేట: వర్షకాలంలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. రోడ్లు, నాలల పరిసరాల్లో చెత్త లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. అంబర్‌పేట సర్కిల్ పరిధిలో వారానికి మూడు రోజులు ఒక్కో డివిజన్ చొప్పున ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. వర్షపు నీటికి చెత్త నాలాలు, కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డుపడకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. అందులో వర్షకాలం ముగిసే వరకు నియోజకవర్గంలో ప్రతి డివిజన్‌లో మూడు రోజుల పాటు స్పెషల్ నిర్వహించనున్నారు. శుక్రవారం అంబర్‌పేట చేపట్టి స్థానికులకు అవగాహన కల్పించారు. ఇతర డివిజన్ల నుంచి అదనపు సిబ్బందిని తీసుకొచ్చి పనులు చేయిస్తున్నట్లు డీఎంసీ మారుతీదివాకర్, ఏఎంహెచ్ఓ డా. హేమలత తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

చిక్కడపల్లి: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని చిక్కడపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం చిక్కడపల్లి పోలీసులకు అశోక్‌నగర్ ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు సమాచారం వచ్చింది. అక్కడకు చేరుకున్న పోలీసులు 108 సిబ్బందిని రప్పించారు. వారు పరీక్షించగా సదరు వ్యక్తి మృతిచెందాడని నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడిని గుర్తిస్తే చిక్కడపల్లి పీఎస్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రేమజంటపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల సమక్షంలోనే అగ్రకుల అధిపత్యంతో ప్రేమ జంటపై దాడి చేయటం సిగ్గుచేటని దాడి చేసిన దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. గత నెల 24న మణిరాజ్, నితీషాలు కులాంతర వివాహం చేసుకున్నారని తెలిపారు. హన్మకొండ జిల్లా సాయంపేట మండల కేంద్రంలో అమ్మాయిల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి ఇరువురు మేజర్లు కావడం వల్ల వదిలిపెట్టారని తెలిపారు. అయితే అమ్మాయి తల్లిదండ్రులు అబ్బాయి బంధువులపై మూకుమ్మడిగా దాడి చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

జంతు వ్యర్థాలను రోడ్లపై వేయొద్దు



భోలక్‌పూర్‌లో ప్లాస్టిక్ బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



బాగ్అంబర్‌పేటలో మసీద్ కమిటీకి ప్లాస్టిక్ అందిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

ముషీరాబాద్: బక్రీద్ సందర్భంగా జంతు వ్యర్థాలను రోడ్లపై వేయకుండా బ్యాగుల్లో వేసి చెత్త సేకరించే కార్మికులకు అందజేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. భోలక్‌పూర్ డివిజన్‌లోని సిద్ధిఖ్‌నగర్, అంజుమన్ వీధిలో శుక్రవారం ఇంటింటికి ప్లాస్టిక్ బ్యాగులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ముస్లిం కుటుంబాలకు ప్లాస్టిక్ బ్యాగులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేందుకు ప్రత్యేక వాహనాలు సైతం అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అక్లాక్‌హుస్సేన్, మహ్మద్ ఆలీ, ముచ్చకుర్తి ప్రభాకర్, సైఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌కు ఏర్పాట్లు పూర్తి

అంబర్‌పేట: బక్రీద్‌కు బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయని కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని మసీదుల కమిటీలకు శుక్రవారం ఆమె ప్లాస్టిక్ కవర్లను పంపిణీ చేశారు. జంతు వ్యర్థాలను అందులోనే వేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. అలాగే గోల్నాకలో సైతం కార్పొరేటర్ దూసరి శ్రీనివాస్‌గౌడ్ ఆయా మసీదులకు కవర్లను అందజేశారు.

మార్కెట్, కృష్ణాపత్రిక భవనాలను కూల్చొద్దు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లిలోని బాపునగర్ వద్ద ఉన్న మున్సిపల్ మార్కెట్, కృష్ణాపత్రిక భవనాలను జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం కూల్చివేసేందుకు అక్కడకు చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్, మార్కెట్ కమిటీ, అసోసియేషన్, బస్తీవాసులు అక్కడకు చేరుకుని వారిని అడ్డుకున్నారు. అధికారులను వారం రోజుల గడువు కోరామని కార్పొరేటర్ పావని తెలిపారు. ఆ తర్వాత మార్కెట్ కమిటీ, అసోసియేషన్, బాపునగర్ బస్తీ కమిటీలతో చర్చించిన తర్వాత కూల్చొద్దని ఆమె స్పష్టం చేశారు. బాపునగర్ బస్తీవాసులు, కృష్ణాపత్రిక భవనం స్థానంలో కమ్యూనిటీహాల్ నిర్మించి ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి సమస్యను వివరించి వారి చొరవతో అధికారులతో సమీక్షించి కమ్యూనిటీహాల్ నిర్మాణంపై తప్పక చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డీఈఈ ప్రాజెక్ట్స్ సుదర్శన్, ఏఈ స్ఫూర్తి, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



చిక్కడపల్లిలో మున్సిపల్ మార్కెట్ వద్దకు చేరుకున్న కార్పొరేటర్ పావని, స్థానికులు

వేడుకగా వాసా స్మారక పురస్కారాల ప్రదానోత్సవం

చిక్కడపల్లి: కిన్నెర ఆర్ట్ థియేటర్స్-వాసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి వాసా ప్రభావతి జయంతిని శుక్రవారం త్యాగరాయ గానసభలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పూర్వ సలహాదారుడు డా. కేవీ.రమణాచారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పెద్దలను స్మరించుకునే వారికి భగవంతుని కృప ఎల్లాప్పుడు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆచార్య అనుమాండ్ల భూమయ్యకు డాక్టర్ వాసా ప్రభావతి జీవన సాఫల్య ప్రతిభా పురస్కారం ప్రదానం చేశారు. అమెరికాకు చెందిన వాసా ఫౌండేషన్ సాహితీ కిరణం మాసపత్రిక సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో సాక్షి విశ్రాంత పాత్రికేయుడు సీహెచ్.శర్మ రాసిన పెళ్లికాని ప్రసాద్ కథకు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖుల సాహితీవేత్త ఓలేటి పార్వతీశం , కిన్నెర సంస్థ ప్రతినిధి మద్దాలి రఘురాం, సాహితీ కిరణం సంపాదకులు సుబ్బారావు, పాలపిట్ట సంపాదకులు గుడిపాటి వెంకటేశ్వర్లు, రచయిత్రి శైలజా మిత్ర, ప్రకాష్ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి బోధన

ముషీరాబాద్: ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ భారత్ సేవా సమాజ్ మీదుగా కొనసాగింది. ర్యాలీలో కరపత్రాలు పంచుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫాం, మధ్యాహ్నం భోజనం అందజేయడంతో పాటు విద్యాబోధనలో ప్రత్యేంకగా డిజిటల్ క్లాస్‌లు, ఏఐ క్లాస్‌లు తీసుకుంటామని ప్రచారం చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి మాట్లాడుతూ.. కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రతన్, పద్మ, ఇస్మాయిల్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కార్పొరేటర్...

ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్ జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయం వద్ద ప్రధాని మోదీ 11ఏళ్ల సుపరిపాలన పూర్తయిన సందర్భంగా శుక్రవారం మొక్కలు నాటారు.

